'మన ఊరు మనబడి'తో సర్కారు స్కూళ్లకు సరికొత్త రూపం

కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తాగునీటి కుళాయి

కొణిజర్ల, అక్టోబర్ 13: విద్యతోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని భావించిన తెలంగాణ సర్కారు స్కూళ్ల అభివృద్ధికి నడుం బిగించింది. సర్కారు బడులను ప్రగతిబాటన నడిపించి మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే మండలంలోని మొత్తం 19 పాఠశాలల్లో మన ఊరు- మన బడి పనులతో పాఠశాలలు సుందరంగా తయారయ్యాయి. మండలంలోని పల్లిపాడు, కొణిజర్ల, తనికెళ్ల, పెద్దగోపతి, సింగరాయపాలెం, పెద్దమునగాల, తుమ్మలపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలుండగా మిగిలిన 12 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సకల సౌకర్యాలతో ఉన్నాయి. దీంతో పాటు తాజాగా పీఎంసీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)కు సింగరాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికైంది. ఈ పాఠశాలలకు ప్రతి ఏటా రూ.40 లక్షలు చొప్పున 5 సంవత్సరాల్లో రూ.2 కోట్లతో పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

పలు అంశాల ప్రాతిపదికన అభివృద్ధి

ప్రభుత్వం 'మన ఊరు- మనబడి' పథకంలో భాగంగా పలు అంశాలను ప్రాతిపదికగా తీసుకొని అభివృద్ధి చేపట్టారు. పాఠశాలకు పక్కా భవనం, భవనల భద్రత, విద్యార్థులకు వేర్వేరుగా తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, హ్యాండ్‌వాష్, ఆటస్థలాలు, లైబ్రరీ, తదితర అంశాల ప్రాతిపదికగా చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా సమసలతో సతమతమవుతున్న సర్కారు పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభు త్వం కంకణం కట్టుకున్న సంగతి తెలిసింది. పాఠశాలలన్నింటికీ రంగులతో తీర్చిదిద్దారు. బ్లాక్‌బోర్డులు, బెంచీలతో సర్కారు బడులు సరికొత్త హంగులు అలుముకున్నాయి.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కారేపల్లి,అక్టోబర్ 13: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది.అందుకు సంబంధించి స్థానిక ఎస్సై పుష్పాల రామారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండల పరిధిలోని లావుడ్యాతండాకు చెందిన లావుడ్యా శివ(52) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఎంతకీ తనకు వచ్చిన జబ్బు నయం కాక పోవటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఇంటికి వచ్చిన తర్వాత కొన ఊపిరితో ఉన్న శివను గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు.మృతినికి భార్య కుమారుడు ఉన్నారు.కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

చికిత్స పొందుతూ శిశువు మృతి

కొణిజర్ల, అక్టోబర్ 13: మూడు రోజుల క్రితం పల్లిపాడు నుంచి దుద్దెపూడి వెళ్లే రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పసికందును ఎవరు గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన సంగతి విధితమే. ఐసీడీఎస్ వారి నుంచి శిశువుకు సంబంధించి సమాచారం రాగా కొణిజర్ల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని ఆ శిశువును డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ వారికి అప్పగించి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కొణిజర్ల ఎస్సై శంకర్‌రావు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 8712659150 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

వైరా టౌన్, అక్టోబర్ 13: మండలంలోని కేజీ సిరిపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని వైరా పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి, రూ.4,500 స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదన్‌లాల్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

వైరారూరల్, అక్టోబర్13: వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపే ధ్యేయంగా అందరం కలిసి పనిచేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో గురువారం రాత్రి బీఆర్ఎస్ నాయకుడు కిలారి శ్రీనివాసరావు అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో వెంపటి కృష్ణ, మడుపల్లి నాగేశ్వరరావు, జుజ్జూరి వెంకటనారాయణ, నల్లమోతు లక్ష్మీనారాయణ, గాజులవరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముగిసిన బొడ్డెమ్మ వేడుకలు

బొడ్డెమ్మ వేడుకల్లో మహిళలు

బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

కారేపల్లి, అక్టోబర్ 13: మండలంలోని పలు గ్రామాల్లో బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకైన బతుకమ్మ వేడుకలకు ముందు పుట్టమట్టితో బొడ్డెమ్మలను తయారు చేసి తొమ్మిది రోజుల పాటు వేడుకలను నిర్వహించి నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో బొడ్డెమ్మలను తయారు చేసి బొడ్డెమ్మ చుట్టూ మహిళలు, చిన్నారులు నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం బొడ్డెమ్మకు మంగళహారతులు ఇచ్చి పసుపు, కుంకుమను వాయినంగా ఇచ్చి పుచ్చుకున్నారు. అదే విధంగా పలు విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయులు జరుపుకున్నారు.

విదేశీ విద్య, ఉపాధిపై 'జేవీఆర్'లో అవగాహన సదస్సు

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 13: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం టీఎస్ కేసీ, కెరియర్ గైడెన్స్ విభాగం, యూనిగ్రాడ్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమిగ్రేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా లండన్ నుంచి వచ్చిన యూనిగ్రాడ్ డైరెక్టర్ నగేశ్ మాట్లాడుతూ.. విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలు పొందడానికి కావాల్సిన కెరీర్, కౌన్సిలింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మేనేజర్ ప్రశాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, కేసీ కోఆర్డినేటర్ బంగారి, కెరీర్ గార్డెన్స్ సెల్ కోఆర్డినేటర్ శ్రీధర్, సభ్యులు సారంగపాణి, మాధవి, శ్రీనివాస్, అధ్యాపకులు మధు, వీరారెడ్డి, చెన్నారావు, అంజనేయులు, ప్రభావతి, శ్రీశాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనిగ్రాడ్ డైరెక్టర్ నగేశ్

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రులు

విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ఉత్సవ నిర్వాహకులు

కారేపల్లి, అక్టోబర్ 13: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాతా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మండపాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు మహిళా భక్తులు అందుకు సంబంధించిన పూజ సామగ్రిని కొనగోలు చేస్తున్నారు. కారేపల్లి క్రాస్‌రోడ్‌లోని దుర్గామాతా విగ్రహాల తయారీ కేంద్రం వద్దకు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి దుర్గామాతా విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు.

రేపటి నుంచి పెద్దమ్మతల్లి ఆలయంలో

ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, భక్తులు

కారేపల్లిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం నుంచి 24వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మండె పూడి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను భక్తులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న గౌరీదేవి, 18న శ్రీలలితాదేవి, 19న శ్రీమహాలక్ష్మీదేవి, 20న సరస్వతీదేవీ, 21న అన్నపూర్ణదేవీ, 22నదుర్గాదేవి, 23న మహిశాసురమర్ధిని, 24న శ్రీరాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సరస్వతీ ఆలయంలో..

సరస్వతీ అమ్మవారు

సత్తుపల్లి, అక్టోబర్ 13: పట్టణ శివారులోని జేవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న శ్రీగాయత్రీ శ్రీలలితా సహిత జ్ఞానసరస్వతి దేవి ఆలయంలో ఆదివారం నుంచి ఈ నెల 23 వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న లలితా త్రిపురసుందరి దేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్ధినిదేవి, 23న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. ఈ నవరాత్రులు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మహిళలకు కుంకుమపూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు సరస్వతీపూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న విజయదశమి సందర్భంగా జమ్మిపూజ నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

కారేపల్లి, అక్టోబర్ 13: మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేశారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై పుష్పాల రామారావు, స్పెషల్ పార్టీ అధికారి సతీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను క్షణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. వాహనదారులు తనిఖీ సిబ్బందికి సహకరించాలని కోరారు.